★ లగ్న బలిమి ★

"సులోచన"

నాగేంద్రం రాజేశ్వరుల వివాహం వొచ్చేనెల నాలుగో తారీఖున రాత్రి పదకొండుగంటల యిరవై నిముషాలకు జరుగుతుందని కొద్ది క్షణాలక్రితమే శుభలేఖవల్ల తెలుసుకొని, విపరీతమైన మనస్తాపానికిగురై ఆవేశపరురాలై, చేతికందుతున్నదని కలలుకన్న మహోజ్వల మహోత్కృష్ట పదార్థం ఆమడదూరం అవతలకు పోయినట్టు-జీవితానికి సంబంధించిన, భవిష్యత్తులో మధురతరం కావాల్సిన సంఘటనలకు దూరం అయినట్టు అవ్యక్తమైన వుద్రిక్తంతో, హృదయాన్ని కోపంతో నింపుకొని, చిందులు త్రొక్కుతూ గదిలో పచార్లు చేస్తూన్నది. పద్మ

ఇంకా ఎన్నోరోజులులేవు వారంరోజులు, పెళ్ళైయిపోతుంది, తనజీవితం అనుభూతుల్లేని మోడుకావాల్సిందే నాగేంద్రం తనని నిలువునా పచ్చిమోసంచేశాడు వివాహం చేసుకుంటానని యిన్నాళ్ళనుంచి అరచేతిలోస్వర్గం చూపిస్తూ కమ్మని కమ్మల్లో కబుర్లుచెపుతూ, తియ్యని మాటలతో వశం చేసుకొని తనఅవసరాల్ని తీర్చుకుంటూ చివరకు గాఢంగా నిర్మలప్రేమని అవగాహన చేసుకొని నిశ్చలంగా ప్రేమించిన, సర్వస్వాన్ని అర్పించిన వ్యక్తినా మోసం చేయాల్సింది? పద్మమనస్సు పరిపరి విధాల్లో సంచలనాన్ని పొందుతోంది ఏమైనాకాని తను నాగేంద్రాన్ని వివాహమాడాల్సిందే, ఈ నిర్ణయం తనలోయివాళ జరగలేదు ఎప్పుడో అతని ప్రేమచూపులకు వశమైన మొదటి క్షణంలోనే నిర్ణయించుకొంది ఇవాళ అదిగట్టిపడింది.

త్వరత్వరగా డ్రస్ చేసుకొని బజార్లోకి వొచ్చింది నాగేంద్రందగ్గరకు వెళ్లేందుకు జట్కావాడు ఎక్కడకువెళ్లాలండీ అంటూవచ్చాడు. జట్కాలో ఎక్కికూచుంది. ఫలానా పేటకుపోనివ్వమంది బండిలో ఆకాస్తకాలం కూడా స్థిమితంగా కూచోలేకపోయింది, పద్మ ఎప్పుడు నాగేంద్రంతో కలుసుకొని మొఖంవాచేట్లు ఛీవాట్లువేసి అతని దౌష్ట్యాన్ని వెల్లడించి, తనఅపారమైన ప్రేమని ప్రకటించి- అతని మనస్సును తనవేపుకు మళ్లించికొని, రాజేశ్వరితో వివాహం జరక్కుండా చేద్దామా అనే అమితమైన ఆత్రుత ఆమెలోని స్థిమితానికీ, నిశ్చలానికీ, భంగం కలిగిస్తోంది.

నాగేంద్రం యింటిముందు ఆగింది జట్కా, చప్పున దిగి, బండివాడికి డబ్బులిచ్చి చకచక నాగేంద్రం గదిలోకి నేరుగా వెళ్లింది. నిప్పులు కక్కేకళ్ళతో పద్మ. నాగేంద్రం కుర్చీలోకూచుని కళ్లుమూసుకొని ఆలోచించే వాడల్లా పద్మ యొక్క భయానకాగమనానికి ఆశ్చర్యచకితుడైనవాడై కుర్చీలోంచి లేచాడు.

పద్మ పిచ్చిచూపులుచూస్తూ నిలబడివుంది కోపం అధికమైనప్పుడు, మాటలుపెకలని దౌర్బల్యం ఆమెలో అనాదినుంచి వుండటంవల్ల అట్లాచూస్తూ, అనవలసిన మాటల్ని వెతుక్కుంటూ నిలబడివుంది

'ఎందుకు పద్మా! అట్లాచూస్తూ నిలుచున్నావ్' అన్నాడు నాగేంద్రం పద్మవైఖరిని ఎటూఅర్థం చేసుకోలేక.

పద్మ కొంచంతేరుకొని—'ఏట్లాచూస్తున్నాను- నాచూపుల్లో నీకేమన్నా' 'మోసం' దృగ్గోచరమౌతున్నదా ?" అన్నది.

'నాకేమీ అర్థంకావటంలేదు· మనస్సులో యేదో అన్యథావానికి స్థానం యిచ్చి మాట్లాడుతున్నావు' అన్నాడు నాగేంద్రం

'నామనస్సులో అన్యథావాలులేవు నాకురెండు మనస్సులూ, రెండునాలుకలూ రెండు హృదయాలు నీకుమాదిరిగాలేవు. ఎల్లకాలం నామనస్సు నిర్మల తేజస్సుతో మెరుస్తూనేవుంటుంది కాని నిన్ను నమ్ముకున్నాను నిన్ను ప్రేమించాను, నీతోనే నాజీవితం నవ్యమార్గంలో నవ్యమైనపంథాలో, నడుస్తూందనీ, ఆనందమయ జీవనంలో అమృత వర్షాన్ని కురిపిస్తుందని ఆశించాను అందుచాతనే నీవాంఛలన్నీ తీర్చాను

కాని నీవు మోసగాడివిగా ఎప్పట్నుంచి మారేవో నాకు తెలియదు. నీలో ఎటువంటి కుళ్ళు, కపటం- ,మంచి

తనం, మరుగులో పరిగణింప బడుతుందో కూడా తెలుసుకో లేని మోహంలో నీవు నన్ను తేల్చి ముంచి యిప్పుడు తీరా సమయం వచ్చేప్పటికి నా కర్మకు నన్ను విడిచి పెట్టి ధూర్తంలోకి దిగావు చదువు కున్న వాడివి, ప్రేమ, సంఘం- సమాజన్యాయం- అర్థం చెసుకున్న వాడివి. ఆపాటి జ్ఞానం తెలీదా? ప్రేమించిన వ్యక్తికి జీవితంలో యివ్వాల్సిన ప్రముఖస్థానం రాజేశ్వరిని చేసుకుంటున్నావు నాకంటే ఆమె యేమంత అందమైంది? నాకంటే ఆమె ఎంత ఎక్కువ చదువు కొంది? నీకు స్త్రీలోని అందం, చదువు, సంస్కారం, సత్ప్రవర్తన అక్కర లేనట్టుంది? రాజేశ్వరికి డబ్బు వుంది ఆమె తండ్రి మిల్లు మేనేజరు. కావల్సినంత ధనం సంపాదిస్తాడు ధనం మీద తక్కిన మానవులకు మల్లే నీకుకూడా 'మంచి'ని త్యజించే ఆపేక్ష వుండటం శోచనీయం!" ఆవేశ పడుతోంది. పద్మ- నాగేంద్రం తల వొంచుకొని కూచున్నాడు. పద్మ అనే ప్రతి మాట అతని హృదయంలో మారు మూలల్లో గుచ్చుకొని అమితమైన వ్యధని కలిగిస్తోంది.

పద్మ యేడుస్తో అంది- "ఏమిటీ? యెట్లా వొప్పుకున్నావు, రాజేశ్వరితో పెండ్లికి? నన్ను యేంచేద్దామని- చెప్పు నీకు నామీద ప్రేమ లేదా? ఇన్నాళ్ళ నుంచి చూపిన ప్రేమ నటనేనా? అవసరాలు తీర్చు కొనేందుకవలంభించిన వలపు చూపులేనా?"

నాగేంద్రం నిరుత్తరుడై నిశ్చలంగా ముఖం దించుకు కూచున్నాడు. లోపల రగిలే అలజడికి అంతులేదు.

"యేమిటి? నామీద నీకు మోహం తప్ప ప్రేమలేదా? మరి ఎందుకు నన్ను యిట్లా మోసం చేసి బాధ పెట్టడం? ఎప్పుడో చెప్పేస్తే పోయేదిగా?" నాగేంద్రం భుజాలు పట్టుకొని వూపుతూ అన్నది పద్మ.

నీళ్ళు కమ్మిన కళ్ళతో జాలిగా తల పైకెత్తి "యేంచేయను పద్మా ! పరిస్థితులు అట్లా సంభవించినవి. ఎదుర్కో లేనంత బలంగా విషమించినవి" అన్నాడు నాగేంద్రం.

'కాదు. నువ్వే రాజేశ్వరి ధనం కోసం ఆశ పడి వుంటావు నేను దురదృష్ట వంతురాల్ని నిన్ను పొందని నాజీవితం అడివి కాచిన వెన్నెల చందాన్ని కాక మరేముంది? నేనింకా బ్రతకటం దేనికి? ఎవరి కోసం?" అని చిందులు తొక్కుతున్నది పద్మ. కోపమూ, అసూయా, విచారమూ కలసి ఆమె లోని మనసత్వానికి వికృత రూపాలు కల్పించినవి

"అట్లా అయితే ఎట్లా? నన్నేం చేయమంటావు చెప్పు నాన్న గట్టి పట్టుదల పట్టాడు అమ్మ ఈ వివాహమే కనుక కాకపోతే ఏ నుయ్యో, గొయ్యో, చూసుకుంటానంటుంది మామయ్య వాళ్లంతా గట్టి పట్టునే పడుతున్నారు ఇన్నిటికీ ముఖ్యం నాన్న అచంచల మైన పట్టుదలే రాజేశ్వరిని పెళ్ళాడని పక్షంలో తలితండ్రుల్ని, బంధువుల్ని, వొదులు కోవాల్సిందని మరీ మరీ నొక్కి చెప్పాడు శైశవంనించీ అతిగారాబంగా పెంచిన తలిదండ్రుల అభిప్రాయాలు అవిధంగా వుంటే యేంచేయమటాంవు పద్మా?" అని బావురు మన్నాడు నాగేంద్రం- పద్మని వారించటం తేలికగా అయ్యే పని కాదని తెలుసుకున్నాక.

"యేమైనా కానీ యిది నేను సహించలేను నా హృదయం నీకోసం తపించి పోతున్నది లేకపోతే నేను ఆత్మహత్య చేసుకుంటాను" అని గబగబ గది దాటి యింటి కెళ్లేందుకు బజార్లోకి వొచ్చేసింది.

"పద్మా!" అని పిచ్చిగా పెద్ద పెట్టున కేక వేశాడు నాగేంద్రం

అతను పద్మను ప్రేమించిన మాట వాస్తవమే ఆమె నాగేంద్రాన్ని ఎంతపట్టుగా ప్రేమించిందో అతనూ పద్మని అంత గాఢంగా ప్రేమించాడు పద్మనే వివాహం చేసుకోవాలని కూడా అతని నిర్ణయం కాని తలిదండ్రుల బంధువుల వొత్తిడి అందుకు పూర్తి వ్యతిరేకం కావటం మూలాన అది అసాధ్యంగా పరిణమించింది నాగేంద్రానికి తనవాళ్ళని వొదులుకోవడం యిష్టం లేదు. పద్మకి తనస్వార్థం చూసుకొని తను అన్యాయం చేస్తున్నాడు అన్న బాధ కూడా నాగేంద్రానికి వుంది ఏటూ తేల్చుకో లేక పోతున్నాడు రాజేశ్వరి, నాగేంద్రం తండ్రి చెల్లెలు కూతురు. వీళ్ళకి చాలా ఆస్థి వుంది. ఒక్కతే ఆడపిల్ల. దగ్గరి బంధుత్వం. అన్ని హంగులూ వున్నవి. అబ్బాయికి తగిన సంబంధం అని తల్లి తండ్రుల ఘోష. నాగేంద్రం బి ఏ. చదవ టానికి ఆర్థిక స్తోమతని కలిగించింది నిజానికి రాజేశ్వరి తండ్రే.

పద్మంటే నాగేంద్రానికి అమితమైన ఆకాంక్ష నిజంగా అన్నంతపనిచేస్తుందేమో కొంపదీసి- అనిలోపల కించ పడుతూ ఎట్లాగైనా పద్మని ఒదార్చాలని ఆరాత్రి పద్మ యింటికి వెళ్ళాడు, నాగేంద్రం,

పద్మ పరుపుమీద పడుకుకొని ఏడుస్తోంది "అధైర్య పడవాకు పద్మా! నాకంటేకూడా ఉత్తమమైన వరుడు దొరకొచ్చునీకు" అనిఅన్నాడు, నాగేంద్రం పద్మని ఓదారుస్తూ.

పద్మ ప్రళయభీకరస్వరూపిణైంది. "ఈవేదాంతం చెప్పటానికే ఒచ్చావా నీవు! కొద్దిరోజులకే నీపద్మ నీకళ్ళకు దూరమవుతుంది.

ఆమెకు ఈ లోకంలో స్థానంలేకుండా చేశావు, ఇంకా కొన్నిరోజులు గడిస్తే నీవల్లనే ఆమెకు 'వ్యభిచారిణి', 'కులట' అన్న అపకీర్తి పేర్లు కూడా వాడుకలో వుంటవి. ఇంకాదేనికి అసలుసంగతిని దాచిపెట్టడం "నాకు మూడో నెల" అని కళ్ళనీళ్లుకార్చింది, పద్మ.

"ఆఁ! మూడోనెల!" నాగేంద్రం కుర్చీలో కూలబడ్డాడు హృదయంలో రాయిపడింది.

"మనజీవితాల్ని అప్రదిష్టపాలుగాకుండా చూడు. నీస్వార్ధాన్ని, తలిదండ్రుల్ని, బంధువుల్ని చూసుకుంటే నాగతేం కాను? స్త్రీని, అందులో ఈసమాజంలో పెళ్ళికాకుండానే గర్భంధరించిన స్త్రీలకు ఎటువంటిదుర్గతి పడుతుందో ఆలోచించు" ఇట్లా అనేకవిధాల నాగేంద్రాన్ని వేడుకొంది పద్మ.

నాగేంద్రం హృదయంలోని కాటిన్యత ద్రవించింది, పద్మ ఏవ్యక్తికారణంగా ఈస్థితికి వొచ్చిందో పూర్తిగా అర్ధంచేసుకున్నాడు పద్మ జీవితం బాగుపడాలంటే తనుముఖ్యం అనికూడా నిశ్చయించుకున్నాడు, కాని తను త్యాగంచేయాలి తలిదండ్రుల్ని అవసరమైతే వీడిపోవాలి. కొంచంసేపు తర్కించుకొని ఒకనిశ్చయానికి వొచ్చి, పద్మని దగ్గరకు తీసుకొని-

'పద్మా! నీయిష్టప్రకారమే చేద్దాం కాని అదియిక్కడ వీలుపడదు. ఇద్దరమూలేచిపోయి ఏబస్తీలోనో వివాహం చేసుకోవాలి. ఇక్కడ నాతలిదండ్రులూ, బంధువులూ ఈవివాహానికి చస్తే అంగీకరించరు. రెండుమూడురోజుల్లో యేర్పాట్లన్నీ చేస్తాను. లేచివెళ్ళిపోదాము" అని అన్నాడు నాగేంద్రం పద్మ యెగిరి నాగేంద్రం కంఠాన్ని కౌగలించుకొని ఆనందబాష్పాలు విడిచింది.

ఆరాత్రి నాగేంద్రం ఇంటికి చేరుకొనేప్పటికి పదకొండు గంటలైంది. 'ఇంతరాత్రివరకూ ఎక్కడవున్నావురా?' అని అడిగిన తండ్రిపశ్నకు- 'సినీమాకు వెళ్ళాను' అని తప్పుడు జవాబు ముక్తసరిగా యేడు అక్షరాల్లో చెప్పి పడకగదిలోకివెళ్ళాడు.

రెండురోజుల్లో పోయేందుకు సన్నాహాలు చేసాడు నాగేంద్రం ఆరాత్రే రైలు ఎక్కటం వాడిదగ్గరా వీడిదగ్గరా మొత్తం ఆరువందల రూపాయలు పోగుచేసాడు నాగేంద్రం. ఆరాత్రి మెయిల్ ఎక్కారు యెరిగినవాళ్ళ కంట బడకుండా, తెల్లవారేసరికి తెనాలిలో దిగారు. అక్కడ రెండురోజులున్నారు.

తెనాలికి ఆరుమైళ్ళ దూరంలోవున్న కొలకలూరులో నాగేంద్రానికి ఒక స్నేహితుడున్నాడు వాడు ఎన్నివుత్తరాలు వ్రాసినా నాగేంద్రం యేదో తీరికలేని కారణంవల్ల వెళ్ళటానికి పడలేదు. ఈసమయంలో నాగేంద్రానికి ఆస్నేహితుడి సంగతి స్ఫురణకు వొచ్చింది

"కొలకలూరులో నా క్లాసుమేటు నాగేశ్వరరావు వున్నాడు చూసివద్దాం" అని నాంగేద్రం పద్మతో అన్నాడు.

పద్మ వొప్పుకుంది.

ప్రొద్దునపూట ఇద్దరూ యేడుగంటలకల్లా కాఫీత్రాగి జట్కాచేసుకొని బస్‌స్టాండ్ దగ్గరకువొచ్చారు తెనాలి నించి కొలకలూరు వెళ్ళటానికి ప్రయాణికులకు ముఖ్యంగా రెండు అవకాశాలున్నవి. రైలుమీద వెళ్లొచ్చు, కారుమీద వెళ్లొచ్చు కారుమీదే సుఖం. ఎందువల్లనంటే కారుమీదైతే వూళ్లోదిగొచ్చు ట్రయిన్ మీదపోవటం అయితే స్టేషనునించి వూళ్లోకి మైలుదూరం నడవాలి. అందువల్ల కారు ఎక్కారు.

ఎనిమిది గంటలకు కారు తెనాలిలో బయలుదేరింది. కారు కొలకలూరు వంతెన దాటగానే ఘోరమైన ప్రమాదం జరిగింది. వంతెనె మలుపు తిరుగుతూండగానే ఎదురుగా పెద్దశక్తిలాగ లారివొచ్చింది. అందువల్ల డ్రైవరు

(తరువాయి 37-వ పేజిలో)

ం త్య వి శ్వా స ము

ఆయాసం ఎక్కువ వుతుంది.''

"పరాయి అమ్మ కన్న పిల్లకదా అని చాలా చులకన చేశాను"

" ...."

"ఏదీ కమల ఇంకారాలా .—అబ్బ — ఆయాసంగా వుంది నేనింక ఆట్టే సేపు బ్రతకను."

"ఏంమాటలమ్మా. పడుకో కాస్సేపు. అదేతగ్గుతుంది"

"కమలని కష్ట పెట్టకు నాయినా"

అంటూ కళ్ళు మూసింది ముసలమ్మ.

★

ల గ్న బ లి మి (27-వ పేజీ తరువాయి)

హఠాత్తుగా విధిగా ప్రక్కకు కారును తప్పుకోవాల్సి వొచ్చింది ఆతప్పుకోవడంలో ప్రక్కన ఎక్కువస్థలం లేకపోవటం వలన- రోడ్డుప్రక్కన చాలాలోతైన ప్రదేశం వుండటంవల్ల కారు పడిపోయింది డ్రైవరు, పద్మ, ఇంకోమనిషీ చనిపోయారు వెంటనే నాగేంద్రానికి దెబ్బలు తగిలినవి

అనుకోని ఈసంఘటనవల్ల జీవితాలు తారుమారైనై పద్మని వొళ్లోయిరికించుకొని చాలాసేపు కుమిలి కుమిలి యేడ్చాడు నాగేంద్రం. కాని యేంలాభం- పద్మ చనిపోయింది

ఎల్లుండి పెళ్లి. పెళ్లికొడుకు కనబడకపోవటంవల్ల నాగేంద్రం తలిదండ్రులు చాలా గాబరా చెందుతున్నారు. నలుగుర్ని నాలుగు దిక్కులకు పంపించారు.

పెళ్లిరోజుకి నాగేంద్రం వొచ్చాడు. తలకూ, చేతులకూ, మోకాలికీ కట్లుకట్టి వున్నాయ్. అందరూ ఆశ్చర్యపోయారు కారు ప్రమాదం సంగతి చెప్పాడు. కానీ, ఎందువల్లనో నాగేంద్రం ఆకారులో పద్మకూడా వుందని, మరణించిందనీ చెప్పలేదు

ఆరాత్రి పదకొండుగంటల యిరవైనిముషాలకు సక్రమమైన లగ్నానికే రాజేశ్వరితో నాగేంద్రానికి పెళ్లి జరిగింది. మరి లగ్నబలిమి!

★

కిన్నెర

సచిత్ర మాసపత్రిక

ఎడిటర్: పందిరి మల్లికార్జునరావు ★ అసిస్టెంట్ ఎడిటర్: పందిరి మీరాబాయి

ఆంధ్రాభ్యుదయానికి కంకణంకట్టుకున్న పత్రిక కిన్నెర ఆంధ్ర జనానీకం పత్రిక కిన్నెర ఆంధ్ర సేవకై పుట్టిన పత్రిక కిన్నెర మన సంఘం, మన ఆర్థిక. జీవనం, ఈ విషమ పరిస్థితులలో ఏవిధంగా పునర్నిర్మాణం కావలసిందీ, మన జీవిత సమస్యలూ, వాటిని యెట్లా పరిష్కరించ వలసినదీ వర్ణించే హృదయంగమములైన కధలతోను వినోదాన్ని, విజ్ఞానాన్ని చేకూరుస్తుంది కిన్నెర

భాష సాహిత్యం, శిల్పం, కళ, ఆర్థిక రాజకీయ విషయాలు, శాస్త్ర విషయక వ్యాసాలు, కధలు, నాటికలు మొదలైనవాటితో సర్వాంగ సంపూర్ణంగా ముచ్చటైన ఆకారంతో ప్రకటింపబడుతుంది

విడి కాపీ 6 అణాలు — సంవత్సర చందా 4 రూపాయలు.

మేనేజరు కిన్నెర, 16, జోన్సు స్ట్రీట్, మదరాసు-1.